


న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో గురువారం దుకాణదారుల, కార్మికులకు వ్యవస్థాపన చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు జి దుర్గయ్య మాట్లాడుతూ దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్మికునికీ తప్పనిసరిగా ఈశ్రమ కార్డులు కలిగి ఉండాలన్నారు. తద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. ఎవరికైనా ఈ శ్రమ కార్డులు లేకపోతే సంబంధిత కార్మిక శాఖలో అధికారులను కలిసి నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జి ఎల్లాజీరావు కార్మికుల హక్కులు, బాధ్యతలు, విధులు గురించి వివరించారు. ఈ న్యాయ అవగాహన సదస్సులో సీఎంఆర్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఇతర షాపింగ్ మాల్ వర్కర్స్ పాల్గొన్నారు.

ముసురేసింది

జిల్లాలో రెండు రోజులుగా ముసురేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గడిచిన రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు నిండుతున్నాయి. రిజర్వాయర్లలో నీరు చేరుతోంది. దీంతో జిల్లా అంతటా రైతులు ఉబాలు పడుతున్నారు. సుమారు 15రోజుల విరామం తరువాత ఉబాలు ఊపందుకున్నాయి. మరోవైపు ఎడతెరిపి లేని వానతో వివిధ పనులపై బయటకు వెళ్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.



నగరంలో కురుస్తున్న వర్షం

జిల్లా అంతటా వర్షాలు

జిల్లా సరాసరి 33.7 మి.మీ నమోదు

ఊపందుకోనున్న ఉబాలు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం 2,25,145 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,60,032 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఇందులో సుమారు 1,50,000 ఎకరాల వరకు సాగునీటి వసతి ఉన్నచోటే సాగినట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత వర్షాలకు వర్షాధార భూముల్లో ఉబాలు పట్టేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. వ్యవసాయ కార్మికులకు చేతి నిండా పనిదొరుకుతోంది. గత ఏడాది ఇదే సమయానికి 1,28,267 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. గత ఏడాదితో పోలిస్తే కాస్త ఎక్కువగానే ఉబాలు సాగినప్పటికీ ఆగస్టు నెలారంభం నుంచి నిన్నమొన్నటి వరకు పెద్దగా వర్షాలు కురవక పోవడంతో దాదాపు 20 రోజులుగా ఎక్కడా నాట్లు పడలేదు. వర్షాలతో మళ్లీ ఉబాలు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

లక్కవరపుకోటలో అత్యధికంగా 63.2, జామిలో 55.4, గుర్లలో 49.8 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా రామభద్రపురం మండలంలో 11.6.మి.మీ. వర్షం కురిసింది. ఈ నెలలో ఇప్పటివరకూ 175.6మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 143.4మి.మీ. వర్షం కురిసింది. 33.2 మి.మీ లోటు ఉంది.

బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లారి 8గంటల వరకు 33.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా లక్కవరపుకోటలో 63.2 మిల్లీ మీటర్లు, జామిలో 55.4 మి.మీ, గుర్లలో 49.8 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా రామభద్రపురం మండలంలో 11.6.మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈనెలలో ఇప్పటివరకూ 175.6మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 143.4మి.మీ. వర్షం కురిసింది. 33.2 మి.మీ. లోటు ఉంది. గత 29 రోజుల్లో 14రోజులు వర్షం కురవగా ఇదే అత్యధికం. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొత్తం ఖరీఫ్ సీజన్ మొత్తాన్ని పరిశీలిస్తే జూన్ నెలలో సాధారణ విస్తీర్ణం 214 మి.మీ, జులై 171 మి.మీకి గాను 229 మి.మీ చొప్పున కురిసాయి. ఈనెలలో మాత్రం 176 మి.మీకి గాను ఇప్పటి వరకు 143 మి.మీ మాత్రమే నమోదైంది. సీజన్ మొత్తం 586 మి.మీ కురవాల్సివుండగా 470 మి.మీ మాత్రమే కురిసింది. వాస్తవానికి వర్షపులోటు ఏమంత ఎక్కువగా లేనప్పటికీ మన జిల్లాలో పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడం, ఉన్న తోటపల్లి ప్రాజెక్టు పనులు పూర్తిచేయక పోవడం, దీంతో, పాటు ఇతర జలాశయాల కాలువలు కూడా ఆధునీకరించకపోవడం వంటి కారణాల వల్ల రైతులు ఇప్పటికీ వర్షాధారంపైనే సాగుకు ఆధారపడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుత వర్షాలతో రైతులు ఊరట చెందుతున్నారు.

వర్షపాతం వివరాలు
(మిల్లీమీటర్లలో)

వంగర	32.2
రేగిడి	28.8
సంతకవిటి	32.7
రాజాం	33.9
బొబ్బిలి	15.0
రామభద్రపురం	11.6
బాడంగి	43.6
తెర్లాం	34.4
మెరకముడిదాం	21.6
దత్తిరాజేరు	19.4
మెంటాడ	29.4
గజపతినగరం	26.2
గరివిడి	42.6
చీపురుపల్లి	43.4
గుర్ల	49.8
బొండపల్లి	27.7
గంట్యాడ	18.6
ఎస్.కోట	33.2
వేపాడ	18.4
ఎల్.కోట	63.2
కొత్తవలస	34.4
జామి	55.4
విజయనగరం	38.9
నెల్లిమర్ల	34.5
పూసపాటిరేగ	42.4
డెంకాడ	39.3
భోగాపురం	38.6
జిల్లా సరాసరి	33.7

తెలుగుభాష వినియోగానికి ప్రాధాన్యత

భావితరాలకు భాష గొప్పదనాన్ని తెలియజేద్దాం
తెలుగు భాషా దినోత్సవంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి, తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం పాలనలో, ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణలో తెలుగు భాషకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. తెలుగుభాష పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. ఎంతో గొప్పదైన మన భాష విలువను భావితరాలకు తెలియజేయాల్సి వుందన్నారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని వ్యవహారిక భాషా దినోత్సవంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కలెక్టర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ, సాహితీవేత్త జక్కు రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు ఎలిశెట్టి సురేష్ కుమార్, జిల్లా అధికారులు సుధాకర్, డి.రమేష్, త్రివిక్రమరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాషను ఎంతో ఉన్నతస్థితికి తీసుకువెళ్లిన గిడుగు రామ్మూర్తిని స్మరించుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. తెలుగు భాషపై మన ఆలోచనలు మారాలని చెప్పారు. మన పిల్లలు తెలుగులోనే మాట్లాడేలా, రాబోయే తరాల వారు ఈ భాష గొప్పదనాన్ని తెలుసుకునేలా ముందుకు తీసుకువెళ్లాల్సి వుందన్నారు. దేశంలో రెండో అతిపెద్ద వాడుకభాషగా తెలుగుకు గుర్తింపు వుందని, దీనిని మనం నిలబెట్టుకోవాల్సి వుందన్నారు. సాహితీవేత్త జక్కు రామకష్ణ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి సాహచర్యం వల్లే గురజాడ అప్పారావు కన్యాశుల్కం వంటి గొప్ప నాటకాన్ని వ్యవహారిక భాషలో అందించారని చెప్పారు. భాష కోసం తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు గిడుగు అని శ్లాఘించారు. కార్యక్రమానికి డివిజనల్ పి.ఆర్.ఓ. ఎస్.జానకమ్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి దేవ ప్రసాద్, కార్యాలయ ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలుగుభాషను పరిరక్షించుకుందాం : జెడ్‌పి చైర్మన్

విజయనగరంటౌన్ : తెలుగుభాషను పరిరక్షించుకొనేందుకు అందరూ కృషి చేయాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని జెడ్‌పి కార్యాలయంలో గిడుగు వెంకట రామ్మూర్తి, మహాకవి గురజాడ అప్పారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుభాష గొప్పదనాన్ని ప్రతీఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిప్యుటీ సిఇఒ రాజ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషను గౌరవించాలి

ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు



గంటేడ గౌరునాయుడును సన్మానిస్తున్న అధ్యాపకులు

విజయనగరం : ప్రస్తుత కాలంలో తెలుగు భాషపై అలసత్వం జరుగుతోందనిప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి వంశ వృక్షం ఉన్నట్లే, భాష యొక్క మూలాలు తెలుసుకొని గౌరవించాలని సూచించారు. తెలుగు భాషా దినోత్సవం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ బి.శుభ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తెలుగుశాఖ అధ్యక్షులు, డాక్టర్ రమా గీత కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి ,రచయిత గంట్రెడ గౌరి నాయుడు గారు మాట్లాడుతూ, పండితులు మాట్లాడేది వేడుక భాషని, ప్రజలు మాట్లాడుకునేది వాడుక భాషని, అందుకే వాడుక భాషలోనే కార్యకలాపాలు అన్నీ జరగాలని, ఇదే మన భాషకు మనం ఇచ్చే గౌరవమని అన్నారు. గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి పంతులు ఒకవైపు, 98 మంది పండితులు ఒకవైపు కాకినాడ మహాసభలో చర్చలు జరిగాయని, అక్కడ ఉన్నవారంతా ఈ ఇరువురి వైపు చూసి నవ్వారని, కానీ తదుపరి ఆ 98 మంది వైపు చూసి ప్రపంచం నవ్వుకుందని, చెబుతూ వ్యవహార భాషోద్యమానికి గిడుగు, గురజాడ చేసిన సేవలను కొనియాడినారు. కార్యక్రమంలో ప్రముఖ కవి సిరికి స్వామి నాయుడు మాట్లాడుతూ, సాహిత్యం మనుషులను తీర్చిదిద్దుతుందని అన్నారు. అధ్యాపకులు డాక్టర్ జైపాల్ రావు మాట్లాడుతూ, సాహిత్య పరిణామ క్రమం గురించి, వివిధ ప్రక్రియలలో జరుగుతున్న సాహిత్యం గురించి వివరించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్. బి. సుభ మాట్లాడుతూ, తెలుగులో వ్యవహారిక భాషా ఉద్యమం తర్వాత, హిందీలో కూడా ఇటువంటి ఉద్యమం వచ్చిందని, ఆ ఉద్యమానికి మన భాష ఉద్యమం స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు గంటేడ గౌరునాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు అందరికీ చేరువ కావాలి

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి- విజయనగరం కోట

బ్యాంకుల సేవలు అన్ని వర్గాల వారికీ చేరువయ్యేలా ఆయా బ్యాంకు యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సూచించారు. నగరంలోని చిన వీధిలో ఆధునీకరించిన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునీకరించడం ద్వారా ఖాతాదారులకు మరింత సులభతరంగా సేవలందించడం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ వర్గాల రుణ అవసరాలను తీర్చడం ద్వారా బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారులకు విస్తరించుకోవాలన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.ఎం.పధాన్ మాట్లాడుతూ నగరంలో తమ బ్యాంకుకు మూడు బ్రాంచిలు వున్నట్టు చెప్పారు. తమ బ్యాంకు ద్వారా గృహ, వాహన రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధికంగా వడ్డీలు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ మెహెర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన

విజయనగరం టౌన్ : నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.నల్లనయ్య బుధవారం నగరంలో పర్యటించారు. ఉదయం గంటస్థంభం నుంచి కన్యకాపరమేశ్వరి కోవెల ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్డు కి ఇరువైపులా రోడ్డు మీద ఫుట్‌పాత్ వ్యాపారులు ఉండటంతో రోడ్డుపై షాపులు తొలగించాలని అన్నారు. రోడ్లపై వ్యాపారం చేస్తే వారికి అపరాధ రుసుము విధించాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. షాపులు యజమానులు, ఫుట్ పాత్ వ్యాపారులంతా చెత్త బుట్టలు పెట్టుకోవాలన్నారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఘోష వద్ద అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

అంతర్జాతీయ తైక్వాండో ఎగ్జామినర్లుగా తండ్రీ కూతురు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఎగ్జామినర్లుగా ఎంపికైన యశస్విని, వేణు

ఈ నెల 21 నుండి 26వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీ కేల్గాం స్టేడియంలో 112 వ అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ కోర్స్, 62 వ పూండాన్ ఎగ్జామినర్ కోర్సు జరిగిది. ఈ సెమినార్‌కు మన జిల్లాకు చెందిన అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు, సిహెచ్ యశస్విని హాజరయ్యారు. వేణుగోపాల్ రావు ఇంటర్నేషనల్ మాస్టర్, హోం డాన్ ఎగ్జామినర్‌గా అర్హత సాధించారు. సిహెచ్ యశస్విని ఇంటర్నేషనల్ మాస్టర్ గా అర్హత పొందారు. మొట్ట మొదటిసారిగా ఈ రాష్ట్రం నుంచి తండ్రి కూతురు అర్హత సాధించడం విజయనగరానికి గర్వకారణమని, వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, చైర్మన్ కె.సుభాష్ చంద్రబోస్, అవనాపు విజయ్ లు అభినందనలు తెలిపారు.

జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారుడికి సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మాజీ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు కమలనాభరావును విజ్ఞాన భారతి పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కమలనాభరావు మాట్లాడుతూ క్రీడల ద్వారా మంచి భవిష్యత్ ఉందన్నారు. క్రీడలు ద్వారా పరిపూర్ణ,క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తయారు కావడానికి తోడ్పడుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలు పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి
5కె రెడ్ రన్ ద్వారా హెచ్‌ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



జెండా ఊపి 5కె రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ప్రతిఒక్కరూ క్రీడల పట్ల మక్కువ పెంచుకొని, వాటిలో భాగస్వాములు కావాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు కోరారు. స్థానిక విజ్జీ స్టేడియం వద్ద విద్యార్థులతో నిర్వహించిన 5 కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్‌ను ఆమె గురువారం ఉదయం ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ మారథాన్ పోటీలను బాలురు, బాలికలు, ట్రాన్స్ జెండర్స్ మూడు విభాగాలుగా పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.7,000, రెండో బహుమతి కింద రూ.4,000 చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అదితి మాట్లాడుతూ, క్రీడల్లో దేశం ఖ్యాతిని ఇనుమడింపజేసిన మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా క్రీడారంగంలో ధ్యాన్‌చంద్ చేసిన సేవలను కొనియాడారు. క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, ఆరోగ్యం కోసం క్రీడల్లో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ రాణి, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి : కలెక్టర్

ఏ వ్యక్తి అయినా జీవితంలో ఎదుగుదల సాధించాలంటే క్రమశిక్షణతో బాటు, ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడా సంస్థ, విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లాకు గొప్ప పేరు సంపాదించిన క్రీడాకారులను, కోచ్‌లను అభినందించారు. జిల్లాలో క్రీడలను అభివద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ప్రకటించారు. అనంతరం క్రీడాకారులను, ఉపాధ్యాయులను, వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ తిరుమలరావు, జిల్లా క్రీడాధికారి వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.

పిల్లలకు సేవ చేసే భాగ్యం సంతృప్తినిచ్చింది

డిసిహెచ్‌ఎస్ బి.గౌరీశంకర్

ప్రజాశక్తి-విజయనగరం కోట



పిల్లలకు వైద్య సేవ చేసే భాగ్యం కలగడం ఉద్యోగ జీవితంలో ఎంతో సంతృప్తినిచ్చిందని చిన్నపిల్లల వైద్య నిపుణులు, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ బి .గౌరీ శంకర్ తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన గురువారం ప్రజాశక్తితో మాట్లాడారు. ఉద్యోగ జీవిత విశేషాలను వివరించారు. ఆయన మాటల్లోనే..

1996లో ఘోషాస్పత్రిలో చిన్న పిల్లల వైద్యునిగా చేరి సేవలు అందించాను. నవజాత శిశువులకు వైద్యం అందించడం సంతృప్తి కలిగించింది. అక్కడే సుమారు 14ఏళ్లు సేవలందించాను. 2011లో ఉద్యోగోన్నతిపై జిల్లా కేంద్రాస్పత్రికి బదిలీ అయి ఐదేళ్లలోపు చిన్నారులకు న్యూట్రిషనల్ సెంటర్‌లో సేవలందించాను. అత్యంత క్లిష్ట సమయంలో వచ్చే వారికి ఎంతో సేవాభావంతో పనిచేసి వారి ప్రాణాలను కాపాడడం ఎంతో సంతృప్తినిచ్చింది. 2014లో ఉద్యోగోన్నతిపై సివిల్ సర్జన్‌గా జిల్లా కేంద్రాస్పరతిలోనే అవకాశం వచ్చింది. నా హయాంలో 40 పడకల ప్రత్యేక పిల్లల వార్డు నిర్మించారు. అనంతరం ఆర్ఎంఒగా, ఆస్పత్రి నోడల్ అధికారిగా విధులు నిర్వహించాను. 2023 జనవరి 1న జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారిగా ఉద్యోగోన్నతి పొందాను. అప్పటినుంచి నేటివరకు హాస్పిటల్ అభివద్ధితో పాటు పిల్లలకు వైద్యం అందిస్తూ వస్తున్నాను.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్తుకు అంతరాయం

విజయనగరం టౌన్ : శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 1 గంట వరకు 33/11 కెవి ఉడా సబ్ స్టేషన్‌లో గల 11కెవి మహాలక్ష్మీనగర్ ఫీడర్ మీద ఉన్న చెట్లు కొమ్మలను తొలగించే క్రమంలో విద్యుత్తుకు అంతరాయం కలగనుందని ఎపిపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉడా ఫేజ్ 1 నుంచి 4 వరకూ బొబ్బాదిపేట, ఇతర ప్రదేశాల్లో విద్యుత్తును నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీతంలో పోస్టర్ ప్రజెంటేషన్

ప్రజాశక్తి- విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో 'సమాజంలో స్టార్టప్‌ల పాత్ర, ఇన్నోవేషన్ అంబాసిడర్లతో సహకారం కోసం మెంటర్‌షిప్ మద్దతు' అనే అంశంపై పోస్టర్ ప్రెజెంటేషన్‌ను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీన్ ఆర్అండ్‌డి డాక్టర్ వై.నరేంద్ర కుమార్ పాల్గొని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు రూపొందించిన పోస్టర్ ప్రజెంటేషన్స్ తిలకిస్తూ వారి ఆలోచనలకు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్టార్టప్స్ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, ఇవి కొత్త ఆలోచనలతో, సాంకేతికతతో వివిధ వ్యాపార అవకాశాలతో ముందుకు వస్తున్నాయని, సమాజంలో ఆర్థిక ప్రగతి, ఉపాధి సృష్టికి దోహదపడుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, ఇ.సి.ఇ విభాగాధిపతి డాక్టర్ టి. డివిఎ నాయుడు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్ శశిభూషణరావు

జాతీయ కరాటే పోటీల్లో పతకాలు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కరాటేలో కోచ్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆగస్టు 25వ తేదిన చెన్నై లో మన్ఫోర్ట్ ఇండోర్ స్టేడియమ్‌లో జరిగిన జాతీయ కెన్యు రియు చాంపియన్షిప్ పోటీలు వివిధ విభాగాలలో తమ ప్రతిభతో పతకాలు సాధించారు. ఈ పోటీలు ఆంధ్ర ప్రదేశ్ చీఫ్, సినీ నటుడు కె. సుమన్, విజనగరం జిల్లా చీఫ్ సంతోష్ కుమార్, శ్రీకాకుళం జిల్లా చీఫ్ డిల్లేశ్వర రావు ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ కెన్యూ రీయు టీంలో విజయనగరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. పి.కుశ్వంత్ కుమార్ కాటా, కుమ్టీలో బంగారు పతకాలు సాధించాడు. కె.శివ కుమార్ కుమ్టీలో రజిత పతకం కాటాలో బంగారు పతకం సాధించాడు. పి. హేమంత్ కుమ్టీ, కాటాలో బంగారు పతకాలు సాధించాడు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆసియా చీఫ్ కోచ్ గిరీష్ పెరూంతట్టన్ అభినందించారు. ఈ సందర్భంగా సత్య కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి అభినందించారు.

సిటియు పనులు వేగవంతం

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ట్రైబల్ యూనివర్సిటీకి సంబంధించిన అప్రోచ్ రోడ్, విద్యుత్, నీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పన వేగంగా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. సంబంధిత శాఖలకు సంబంధించిన అంచనాలను రెండు రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు. మార్చి 2025 లో తరగతి గదులు ప్రారంభించవలసి ఉన్నందున నిధులు మంజూరు అయిన మర్నాడే పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్ లో ట్రైబల్ యూనివర్సిటీ పనుల పై సమీక్షించారు. భూ సేకరణ సమస్య ను రెండు రోజుల్లో పరిష్కరించాలని, కోర్టులో ఉన్న 3 ఎకరాల భూమికి సంబంధించి కక్షి దారుతో సంప్రదించి ఒప్పించాలని బొబ్బిలి ఇంఛార్జి ఆర్‌డిఒ సుధా రాణికి సూచించారు. అప్రోచ్ రోడ్ భూ వివాదం పరిష్కారం కాకపోతే అలైన్మెంట్ మార్చడానికి ఉన్న వీలును పరిశీలించాలని ఆర్అండ్‌బి ఎస్ఇ విజయ్ రత్నంకు సూచించారు. భూ సమస్య తీరగానే సెప్టెంబర్ 15 నుండి రహదారి పనులను ప్రారంభించడానికి సిద్ధం కావాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి 6 కోట్ల విలువైన పనులను చేపట్టవలసి ఉండగా ఇప్పటికే 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు చేయడానికి, పూర్తైన పనులుకు బిల్లులు చెల్లించుటకు ప్రతిపాదనలు పంపాలని ఎస్ఇ ఉమా శంకర్ కు తెలిపారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి, సర్వీస్ కనెక్షన్ కు అవసరమగు నిధుల కోసం వెంటనే అంచనాలను పంపాలని ఎస్ఇ లక్ష్మణరావుకు తెలిపారు. సమావేశం లో ఇంచార్జ్ డిఆర్ఒ సుమబాల, ట్రైబల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ టి.శ్రీనివాసన్, మెంటాడ, దత్తిరాజేరు తహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించండి

- సేఫ్టీ ఆడిట్ నిర్వహించని పరిశ్రమలపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారికి సిఐటియు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



డిసిఎల్‌కు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు

భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమల యాజమాన్యాలపై కేసులు పెట్టి, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి సుబ్రహ్మణ్యానికి గురువారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ తదితరులు వినతి అందజేశారు. కార్మికుల ప్రాణాలకు భద్రత, భరోసా కల్పించాలని, పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించడంతో పాటు కార్మికులకు సంఘాలను పెట్టుకునే హక్కు కల్పించాలని, అందుకు లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక శాఖ అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటిని ప్రభుత్వ హత్యలు గా భావించి నైతిక బాధ్యత వహించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శులు బి. సూర్యనారాయణ, మద్దిల రమణ, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎజగన్మోహన్‌రావు, బి రమణ, జిల్లా కమిటీ సభ్యులు ముత్యాలు ,వెంకటరమణ రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వన సంరక్షణపై సమీక్ష

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ పట్నాయక్ గురువారం వన సంరక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ప్రధానంగా బిఆర్ అంబేద్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో వివిధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో ఆ గ్రామ సర్పంచులతో మొక్కలు నాటించే కార్యక్రమం నిర్వహించాలన్నారు. శనివారం శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపిఒ అదిలక్ష్మి, పిఆర్ఇఇ ఆలీ, అగ్రికల్చర్ ఎఒ యశ్వంత్‌కుమార్, పిహెచ్‌సి వైద్య అధికారులు ధరణి, సిహెచ్ఒ అంజనేయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అధికంగా ఎరువులు వాడొద్దు

ప్రజాశక్తి - డెంకాడ

అధిక మోతాదుకు మించి రసాయనాలు ఎరువులు వాడకూడదని ఎఒ నిర్మల అన్నారు. మండలంలోని సింగవరం గ్రామంలో పెట్టె శ్రీనివాసరావు పొలంలో ఇండి గాప్ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోతాదుకు మించకుండా రసాయనాలను, ఎరువులు ఎలా వాడాలి అనే విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ మోతాదులో పంట అవశేషాలు ఉండే దేశంలో ఎక్కడైనా వ్యవసాయ ఉత్పత్తులను రైతులు అమ్ముకోవచ్చునన్నారు. సేంద్రియ వ్యవసాయం, రక్షక పంట విధానాలను ప్రకృతి వ్యవసాయదారులకు వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట వేసిన ప్రతి ఒక్క రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు పొలంబడి రైతులు గ్రామ పెద్దలు ఎఇఒ రామకోటి, విజయనగరం వ్యవసాయ శాఖ నుంచి ప్రకాశ్ పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - బొబ్బిలి

జయప్రకాష్ పాఠశాలకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఆదేశించారు. జయప్రకాష్ పాఠశాల రోడ్డు పాడైపోవడంతో స్థానికులు ఆందోళన చేయడంతో వెట్ మిక్స్‌తో రోడ్డు వేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు పాడైపోవడంతో రోడ్డును ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు పడకుండా చూస్తామని చైర్మన్ మురళి అన్నారు.

సిఐను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణ సిఐ కె.సతీష్ కుమార్‌ను జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, జనసైనికులు గురువారం పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 2న జరగనున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలలో పాల్గొనాలని ఆహ్వానించారు.

సమయపాలన పాటించేలా చూడండి

ప్రజాశక్తి - బొబ్బిలి

తాగునీటి సరఫరాలో సమయపాలన పాటించేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిను మహిళలు కోరారు. పట్టణంలోని నాలుగో వార్డు దావాలవీధి, రోళ్లవీధి, అంట్యాకుల వీధి, బ్యాంకు కాలనీలలో గురువారం ఆమె వార్డు సందర్శన నిర్వహించారు. కుళాయిలు ఇచ్చే సమయంలో సమయపాలన పాటించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సమయానికి సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని మహిళలు కోరారు. అంట్యాకుల వీధిలో వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభం షాక్ కొడుతుందని షాక్ కొట్టకుండా చూడాలని ప్రజలు కోరగా విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పాడైపోయిన విద్యుత్ స్తంభాలు వేయాలని ప్రజలు కోరారు. బ్యాంక్ కాలనీలో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మించాలని కోరగా ఇప్పటికే పనులకు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. గురువారం సిఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వ్యతిరేకత, సైబర్ క్రైమ్, ఉమెన్ ట్రాఫికింగ్, న్యూ క్రిమినల్ లాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తుమందు వాడకం వల్ల యువత ఏ రకంగా భవిష్యత్తు పాడు చేసుకుంటున్నారో, వాటికి దూరంగా ఉండి, భవిష్యత్తు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిఐ డి.రామ గణేష్, ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒ ఎల్.సంధ్య, ఎస్.అప్పారావు విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నశిర్లాం ఎస్ఎంసి చైర్మన్‌గా రమేష్

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని చిన్నశిర్లాం ప్రాథమిక పాఠశాలలో వాయిదా పడిన స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు గురువారం ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికలలో చైర్మన్‌గా పెంకి రమేష్, ఉప చైర్మన్‌గా గొల్లాపు పార్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఏడు తరగతులకు ఎన్నికలు జరిగాయి. కోరం లేక 8 తరగతి ఎన్నికలు వాయిదా పడింది. 24 మంది కార్యవర్గ సభ్యులలో 17 మంది సభ్యులు హాజరు కాగా, ఆమోదంతో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఇఒ వరప్రసాదరావు, ఎరకయ్య పరిశీలించారు. ఎన్నికైన ఎస్ఎంసి కార్యవర్గంతో ప్రమాణం చేయించారు.

31న పింఛన్లు పంపిణీ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఈనెల 31వ తేదీన సామాజిక పింఛన్లను పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం ఉద్యోగులకు సెలవు కావడంతో ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేయాలని సిఎం నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆరోజు అందుబాటులో లేని వారికి సెప్టెంబరు 2న పింఛన్లు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో 11కెవి బల్లంకి ఫీడర్ నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎఇ జి.సురేష్‌బాబు తెలిపారు. ఎం.సింగవరం, బానాది, బల్లంకి, తెలికీపేట, ఎకెఎస్ పాలెం, కుంపల్లి, నల్లబిల్లి, నర్సాపేట, ఎస్‌కోటపురం, పెదగుడిపాల, బర్రివానిపాలెం, భక్కునాయుడు పేట, రాయుడు పేట, చినగుడిపాల, నల్లబిల్లి, సంజీవమెట్ట గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో వన మహోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం వేపాడ అంగన్‌వాడీ కేంద్రం -2లో ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు మొక్కలు నాటారు. సూపర్ వైజర్లు జి.కామేశ్వరి, పి.భాగ్యవతి, అంగన్వాడీ కార్యకర్తలు డి.మంగలక్ష్మి, ఎ.దేవి, బి.రాజేశ్వరి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ఎంపికలో తప్పిదాలు సవరించండి : ఆప్టా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతిఏటా సెప్టెంబర్ 5న ఇచ్చే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో గల తప్పిదాలను సవరించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఎ జి ఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళి ప్రకాష్ రావు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కోరారు. ఈమేరకు లేఖ రాశారు. అవార్డుల తక్కువ మంది ఉపాధ్యాయులకే రాష్ట్ర అవార్డులను ఇస్తున్నారని, కానీ ప్రభుత్వ జిల్లాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఎపి గురుకులాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన గురుకులాలు తదితర వివిధ మేనేజ్‌మెంట్ లకు చెందిన ఎక్కువ మంది ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వాలని కోరారు.

మరుగుదొడ్డిని వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ సహాయకమిషనర్ సిహెచ్ తిరుమలరావు గురువారం వార్డు పర్యటన చేశారు. దాసన్నపేట వాటర్ ట్యాంక్ వద్ద పశు సంచారం ఎక్కువగా ఉండడంతో వ్యర్థాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. నిరుపయోగంగా పడి ఉన్న సామాజిక మరుగుదొడ్డి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. వివిధ ప్రాంతాలలో పర్యటించిన అధికారులు సమస్యలను పరిష్కరించాలని వాటిని ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్థానికులతో చెప్పారు.

ప్రభుత్వ ఐటిఐ పరీక్షల్లో అక్రమాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో జరిగిన పరీక్షలలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ, మూడు ప్రైవేట్ ఐటిఐలలో చదువుతున్న ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రభుత్వ ఐటిఐలో కంప్యూటర్ బేసిడ్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ప్రభుత్వ ఐటిఐలో పరీక్షలు జరగడంతో ఐటిఐలో పని చేస్తున్న ఒక రెగ్యులర్ ఉద్యోగి, ఒక కాంట్రాక్టు ఉద్యోగి కలిసి పరీక్షలలో పాస్ చేపిస్తామని చెప్పి విద్యార్థులు నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు చర్చ జరుగుతుంది. విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం వారికి తిరిగి జవాబులు చెప్పడం వంటి బాధ్యతలు ఈ ఇద్దరు ఉద్యోగులే తీసుకున్నట్లు తెలిస్తోంది. అక్రమ వసూళ్లపై విద్యార్థులను ప్రశ్నించగా ఐటిఐ ఉత్తీర్ణత కావాలంటే తప్పనిసరిగా డబ్బులు చెల్లించాల్సిందేనని పేరు చెప్పేందుకు ఇష్టపడని కొంతమంది విద్యార్థులు చెపుతున్నారు. తమ పేరు సార్లకు తెలిస్తే తమను ఫెయిల్ చేపిస్తారని అక్రమ వసూళ్లపై చెప్పిన విద్యార్థులు భయపడుతున్నారు. తమ పేర్లు కూడా చెప్పేందుకు విద్యార్థులు ముందుకు రావడం లేదంటే విద్యార్థులను ఎంత తీవ్ర స్థాయిలో భయ పెడుతున్నారో అర్థం చేసుకోవచ్చును.

● పాస్ పేరుతో పెద్ద ఎత్తున వసూళ్లు
● కీలక పాత్ర పోషించిన ఇద్దరు ఉద్యోగులు



పరీక్ష రాయకుండా ఖాళీగా కూర్చున్న విద్యార్థులు(సీసీ పుటేజీ)

పాస్ పేరుతో విద్యార్థులు నుంచి అక్రమ వసూళ్లు

ఐటిఐలో ఈనెల 22 నుంచి 29వరకూ పరీక్షలు జరిగాయి. ప్రతిరోజు మూడు షిప్టులలో పరీక్షలు జరిగాయి. ఒకొక్క షిప్టుకు 50మంది చొప్పున రోజుకు 150మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలలో ఉత్తీర్ణత చేస్తామని చెప్పి ఒకొక్క విద్యార్థి నుంచి రూ.1500 నుంచి రూ.3వేలు వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాము అడిగిన డబ్బులు ఇస్తేనే పరీక్షలలో ప్రశ్నలకు జవాబులు చెప్పి ఉత్తీర్ణత చేపిస్తామని ఒక రెగ్యులర్ ఉద్యోగి, ఒక కాంట్రాక్టు ఉద్యోగి చెప్పడంతో విద్యార్థులు వారు అడిగిన డబ్బులు ఇచ్చి పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా విజువల్స్‌ను ప్రజాశక్తి ప్రతినిధి పరిశీలించగా పరీక్షా ప్రారంభం అయిన గంటన్నర వరకు విద్యార్థులు పరీక్షలు రాయకుండా సమయాన్ని గడపడం కనిపించింది. పరీక్ష ముగియడానికి 30నిమిషాలు సమయం ఉందనగా సీసీ కెమెరా ఫుటేజిను పరిశీలించేందుకు వీలులేకుండా ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి ప్రజాశక్తి ప్రతినిధిని బయటకు పంపివేశారు. ఆఖరు 30 నిమిషాలు సమయం నుంచి ఫిట్టర్ ట్రేడ్ విద్యార్థులకు ఫిట్టర్ ట్రైనీ మాస్టర్, ఎలక్ట్రికల్ ట్రేడ్ విద్యార్థులకు ఎలక్ట్రికల్ ట్రైనీ మాస్టర్, అన్ని ట్రేడ్లకు సంబంధించిన విద్యార్థులకు ఆయా ట్రేడ్ ట్రైనీ మాస్టర్లు పరీక్షా కేంద్రంలోకి వెళ్లి కంప్యూటర్లో ఉన్న ప్రశ్నలు చదివి జవాబులు చెపుతున్నట్లు తెలుస్తోంది. జవాబులు చెప్పే సమయంలో ఇతరులను పరీక్షా కేంద్రం, ప్రిన్సిపాల్ కార్యాలయంలోకి అనుమతి ఇంచడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ వసూళ్లపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జ్వరాలపై ముందస్తు చర్యలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

వర్షాలు పడుతున్న నేపథ్యంలో విష జ్వారాలు ప్రభలే అవకాశం ఉన్న సందర్భంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు గర్భాం పిహెచ్‌సి వైద్యాధికారి అజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రోజుకు ఐదు నుండి పది వరకు జ్వర పీడితులు వస్తున్నారని, వారికి వెంటనే చికిత్స అందించటమే కాకుండా తగిన మందులు సరఫరా చేస్తున్నామని అన్నారు. విషజ్వరాలు బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు, సూచనలు కూడా తెలియచేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు ప్రతిరోజు కాచి చల్లార్చిన వేడి నీరు తీసుకోవాలని, ఈ సమయంలో ద్రవ పదార్థాలు తీసుకోవాలని, దాని వల్ల స్టమక్‌పై ఎక్కువ భారం పడకుండా ఉంటుందని చెప్పారు. గ్రామాలలో వారానికి ఒకసారి డ్రై డే నిర్వహిస్తున్నామని, వీధల్లో నీరు నిల్వ ఉన్నచోట శానిటేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాద కరమైన విషజ్వరాలు లేవని, వచ్చినా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

నూతన పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి

ప్రజాశక్తి-చీపురుపల్లి

నియోజకవర్గానికి నూతన పరిశ్రమలు తీసుకు రావడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. పట్టణంలోని ఆంజనేయపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, కుచ్చర్లపాటి త్రిమూర్తులురాజులతో కలసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళావెంకటరావు మాట్లాడుతూ తనను చీపురుపల్లి నుండి ఎమ్మెల్యేగా ఎన్నుకున్న నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నిరంతరం ప్రజలలో ఉండి వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటానని చెప్పారు. చీపురుపల్లిలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసామని తనతో పాటు నాలుగు మండలాల నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. నియోజకవర్గంలో ఏ గ్రామాలైతే తోటపల్లి ద్వారా నీరందలేదో ఆయా గ్రామాలకు ఉత్తరాంధ్ర సుజల శ్రవంతి ద్వారా తాగునీరు, సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో సుమారు 52 వేల ఎకరాలకు సంబంధించి తోటపల్లి ద్వారా నీరందిస్తున్నామన్నారు. తోటపల్లి కాలువ కింద ఉన్న సుమారు 4 వేల చెరువులను నింపేందుకు చంద్రబాబునాయుడు ప్రత్యేక జిఒ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలకు సంబంధించి ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. అన్ని పిహెచ్‌సిల ఆధ్వరంలో ఉన్న గ్రామాలలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకోసం ఎప్పటికప్పుడు వైద్యాదికారులతో చర్చలు జరుపుతున్నామని వైద్య ఆరోగ్య పరికరాలు ఆయా ఆసుపత్రులకి అందజేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో పాత పరిశ్రమలను తెరిపించడంతో పాటు నూతన పరిశ్రమల ఏర్పాటునకు కృషి చేస్తానని అన్నారు. చీపురుపల్లిలో ఎటువంటి మధ్యవర్తిత్వంగానీ, దందాలు లేకుండా స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునేందుకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

కంప్యూటరీకరణ త్వరగా పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి- గుర్ల

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. మండలంలోని కెల్ల పిఎసిఎస్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న రికార్డుల కంప్యూటరీకరణను పరిశీలించారు. జరుగుతున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. టీసీఎస్ సాఫ్ట్వేర్ ను పరిశీలించారు. పర్సన్ ఇంఛార్జులు, కార్యదర్శుల నియామక ప్రక్రియపై ఆరా తీశారు. బ్రాంచ్ కంప్యూటరీకరణ దాదాపు పూర్తయిందని అధికారులు జేసీకి వివరించారు. మొత్తం 65 పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణ సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని, అక్టోబరు 2 నుంచి కంప్యూటర్ల ద్వారా లావాదేవీలు నిర్వహించాలని జెసి ఆదేశించారు. ఈ పర్యటనలో డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు, కెల్ల బ్రాంచ్ మేనేజర్ కె. ప్రీతిమానస, సూపర్ వైజర్ వై.యెర్నిబాబు, ఇతర సిబ్బంది, తహశీల్దార్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

శాస్త్ర విజ్ఞానంపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి- బొబ్బిలి

శాస్త్ర విజ్ఞానం గురించి విద్యార్థులకు విస్తృతంగా తెలియజేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాజ్‌గోపాల్ అన్నారు. స్థానిక తాండ్రపాపారాయ మున్సిపల్ స్కూల్లో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బొబ్బిలి డివిజన్ ప్రాంతీయ సమావేశాన్ని నాయకులు శంబంగి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో శాస్త్రీయ దృక్పథం కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. ఏటా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు ఈ సంవత్సరం పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న, మండల స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 27న, రాష్ట్ర స్థాయిలో నవంబరు 9,10 తేదీలలో నిర్వహిస్తామని చెప్పారు. సమావేశం అనంతరం చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమణప్రభాత్, జిల్లా ఉపాధ్యక్షులు పి.సత్యం నాయుడు, నాయకులు ఆనెం శ్రీనివాస్, కృష్ణదాసు, రమణమూర్తి, శివశంకర్, శివ కుమార్, రామకృష్ణ, ప్రసన్నకుమార్, మధుసూధనరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం కావాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఒలింపిక్ క్రీడలలో రాణించాలంటే కింది స్థాయి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం మరింత ఎక్కువ ఉండాలని ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వేంకటేశ్వరరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలన్నారు. క్రమశిక్షణతో కృషి చేస్తే మనం ఆశించిన లక్ష్యాన్ని చేరుకోగల మన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ విద్యార్థులు వృథాగా మొబైళ్లతో కాలయాపన చేయకుండా క్రీడలలో పాల్గొంటే శారీరక, మానసిక ధారుఢ్యం మెరుగుపరచుకోవచ్చన్నారు. అనంతరం వివిధ క్రీడాంశాలలో విజేతలకు వేంకటేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు సన్నీడియోల్, విజయ్ బాబు, పుష్పలత, అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణ పాల్గొని ప్రసంగించారు.

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మొదటి జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఆగస్టు 29, 2012న జరుపుకున్నట్లు గుర్తు చేశారు. మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని క్రీడా దినోత్సవంగా పిలుస్తున్నామన్నారు. ధ్యాన్ చంద్ మూడుసార్లు ఒలింపిక్ స్వర్ణ పతక విజేతగా భారత హాకీ జట్టులో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పాపారావు, ఇఒపిఆర్‌డి నీలిమ, మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు

కేంద్ర నిర్ణయాలతో ఎల్ఐసికి నష్టం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎల్ఐసి సంస్థను, ఏజెంట్లను నష్టపరిచే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సిఐటియు యూనియన్ అనుబంధమైన ఎల్ఐసి ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జిల్లా వైస్ ప్రెసిడెంట్ డివిఎ నారాయణరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద ఏజెంట్లు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్టోబర్ నెల నుంచి ఎల్ఐసిలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మార్పుల వల్ల ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఎల్ఐసి సంస్థకు, సంస్థ అభివృద్ధికి పట్టుకొమ్మల్లా ఉన్న ఏజెంట్లకు నష్టం కలుగుతుందని చెప్పారు. ఈ విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకుని ఎల్ఐసి ఎఒఐ ఆరవ అఖిలభారత సమావేశంలో ఆమోదించిన డిమాండ్ల చార్టర్‌ను చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ప్రెసిడెంట్ సిహెచ్ లక్ష్మణరావు, సెక్రెటరీ ఆర్ ఎస్ నాయుడు, ట్రెజరర్ పి వేణు, ఎల్ఐసి ఏజెంట్లు వీరభద్రుడు, వెంకట్, సత్యనారాయణ పాల్గొన్నారు.


గరివిడి : స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద ఏజెంట్స్ ఆర్గనైజషన్ ఆఫ్ ఇండియా యూనియన్ ఆధ్వర్యంలో ఎల్ఐసి సంస్థను, ఏజెంట్స్‌ని ప్రభావితం చేసే నిర్ణయాలకు వ్యతిరేకంగా గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసిలో శతశాతం ఎఫ్‌డిఐ పెంపును విరమించుకోవాలని, ఎల్ఐసి ప్రీమియంలపై జిఎస్‌టిని మినహాయించాలని, భీమా సుగం, భీమా విస్టాల్, భీమా వాహక్ వంటి వ్యవస్థలతో ఎల్ఐసి నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు గేదెల రామారావు, నడిమింటి సత్యన్నారాయణ, సిహెచ్ రామకృష్ణ తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఎస్‌కోట: నిరసన తెలుపుతున్న ఎల్ఐసి సిబ్బంది



నెల్లిమర్ల: గిడుగు రామ్మూర్తి వేషధారణలో డైట్ విద్యార్థులు, అధ్యాపకులు



కొత్తవలస : నృత్యం చేస్తున్న చిన్నారులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బొబ్బిలిలో తెలుగు తల్లి విగ్రహానికి పూల మాల వేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు రామ్మూర్తి పంతులు వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. ప్రజాశక్తి- యంత్రాంగం



బొబ్బిలి: తెలుగు తల్లికి పూలమాల వేస్తున్న జెసి రాజు



వేపాడ : నృత్యం చేస్తున్న బాలికలు



గరివిడి మండలం కాపు శంబారం జెడ్‌పి హైస్కూలులో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు రాము, తదితరులు

నేరాలు ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని విజయనగరం నాతవలస రహదారి గునుపూరు సమీపంలో ఆగి ఉన్న ఐరన్ లారీని ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చోల్లంగిపేట పంచాయతీ పోతయ్యపాలెం గ్రామానికి చెందిన కోరాడ సురేంద్ర (19) తన ట్రాక్టర్‌కి ఆయిల్ తేవడానికి డెంకాడలో ఉన్న ఆయిల్ బంకుకు గురువారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వచ్చాడు. అక్కడ నుంచి పెద్ద తాడివాడ పంచాయతీ ఊడికలపేట తన మేనత్త ఇంటికి వచ్చి తిరిగి తన స్వగ్రామం పో తయ్యపాలెం వెళ్ళిపోతుండగా మార్గమధ్యంలో గుణుపూర్ వద్ద రహదారిపై ఐరన్ లోడుతో ఆగి ఉన్న లారీని వెనక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో లారీలో ఉన్న ఇనుప ఊచలు తలలోనికి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే సురేంద్ర మృతి చెందాడు. మృతునికి తల్లిదండ్రులతో పాటు తమ్ముడు రాజు కూడా ఉన్నాడు. మృతుడు ట్రాక్టర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చేతికి అంది వచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సురేంద్ర (ఫైల్)

గంజాయి కేసులో 10మంది అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

గంజాయి కేసులో 10మంది నిందితులను అరెస్టుచేసి వారి నుంచి 24కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో నిందితులను హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిందితులు చోరీలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించి, గతంలో నేరాలకు పాల్పడిన కేసుల్లో ఐదు మోటారు సైకిళ్ళు, ఒక మొబైల్ ఫోను రికవరీ చేసినట్లు వెల్లడించారు. రైల్వే స్టేషను సమీపంలోని రైల్వే పాత క్వార్టర్సు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం రావడంతో సిబ్బంది పది మందిని అదుపులోకి తీసుకున్నారని, వీరిలో నలుగురు జువినల్స్ ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిందితులను పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. సమావేశంలో 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, ఎస్‌బి సిఐ కెకెవి విజయనాథ్, విజయనగరం 1వ పట్టణ ఎస్ఐలు నవీన్ పడాల్, సరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో హెడ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - భోగాపురం

భూ వివాదంలో విశాఖ సిటీలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ధర్మాల అప్పారావుపై భోగాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సిఐ ప్రభాకర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తూడెం గ్రామానికి చెందిన జీరు వెంకట్రావుకు అదే గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ధర్మాల అప్పారావుకు పక్క పక్కనే భూములు ఉండడంతో వీరి మధ్య గత కొన్ని రోజులుగా భూవివాదం జరుగుతోంది. ఇటీవల జీరు వెంకటరావు తన భూమిని సర్వే చేసుకుని భూమి చుట్టూ సిమెంట్ స్తంభాలతో ఫెన్సింగ్ వేసుకున్నారు. అందులో కొంత తన భూమి ఉందంటూ వెంకటరావు వేసిన ఫెన్సింగ్‌ను హెడ్ కానిస్టేబుల్‌తో పాటు ఆయన కుమారుడు తొలగించారు. దీనిపై వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి హెడ్ కానిస్టేబుల్‌తో పాటు ఆయన కుమారుడు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెట్టు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని మదనాపురంలో చెట్టు పై నుంచి జారిపడి గురువారం ముంత అప్పారావు(50) మృతి చెందాడు. ఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. అప్పారావు మదనాపురంలోని ఓ షాపు ఓపెనింగ్‌లో భాగంగా నేరేడు కొమ్మలు కోసేందుకు చెట్టాక్కాడు. అక్కడి నుంచి జారి పడిపోవడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పిడుగులకు విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి - భోగాపురం

పిడుగులకు భోగాపురం గ్రామంలోని చాలామంది ఇళ్లల్లో విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. బుధవారం రాత్రి భోగాపురం పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పిడుగులు పడ్డాయి. దీంతో భోగాపురం ఎస్‌సి, బిసి కాలనీతోపాటు, సిమ్మపేట చుట్టుపక్క గ్రామాల్లో ఇళ్లల్లో ఉన్న విలువైన టీవీలు, ఇన్వెటర్లు, విద్యుత్ బల్బులు దగ్ధమయ్యాయి.